


10 కేజీల గంజాయి, బడా స్మగ్లర్ పట్టివేత



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్

వడమాలపేట మండల పరిధిలో పది కేజీల గంజాయిని, బడా స్మగ్లర్‌ను పట్టుకున్నట్లు ఎస్ఐ ధర్మారెడ్డి తెలిపారు. పూడి రైల్వేస్టేషన్ వద్ద ఆకస్మిక తనిఖీ నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా రెండు బ్యాగులు కలిగి ఉండడంతో పోలీసు సిబ్బంది చాకచక్యంగా చుట్టుముట్టి పట్టుకుని అరెస్టు చేసి, 10 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఆర్ముగం కందస్వామి (55) బడా స్మగ్లర్ అని, తమిళనాడు రాష్ట్రం మధురై వాసిగా గుర్తించి కోర్టుకు పంపారు.

"ఉపాధి"పై ఉక్కుపాదం..!

• నేడు సార్వత్రిక సమ్మె • సక్సెస్‌కు సన్నాహాలు

'ఉపాధి'పై మోడీ ప్రభుత్వం రోజురోజుకూ ఉక్కుపాదం మోపుతోంది.. జీతం బెత్తెడే.. చాకిరీ బారెడు.. అన్న చందంగా వ్యవహరించడమే గాకుండా 10-12 గంటలు పనిచేస్తే ఆర్థిక వ్యవస్థ పది లక్షల కోట్ల డాలర్లకు పెరుగుతుందని కొంతమంది వ్యాపారవేత్తలు పనిగట్టుకుని ప్రచారం చేస్తున్నారు. ఎల్ అండ్ టి ఛైర్మన్ ఎస్ఎస్ సుబ్రమణ్యం ఆదివారంతో సహా వారానికి 90 గంటలు పనిచేయాలని చర్చ లేవనెత్తారు. ఇన్ఫోసిస్ వ్యవస్థాపకులు నారాయణమూర్తి కూడా అదే అభిప్రాయంతో ఏకీభవించారు. వారానికి 70 గంటలు సూచించారు. ఫ్యాక్టరీస్ చట్టం 1948 ప్రకారం రోజువారి పనిగంటలు గరిష్టంగా 9 గంటలు, వారంలో గరిష్టంగా 48 గంటలు.పనిగంటలు పెంచడం వల్ల కార్మికుల సమర్థత, నాణ్యత దెబ్బతింటాయని, దేహానికి విశ్రాంతి తప్పనిసరి అని ప్రపంచ ఆరోగ్య సంస్థ మాజీ ప్రధాన శాస్త్రవేత్త సౌమ్య స్వామినాథన్ వ్యాఖ్యానించారు. ఎన్ని గంటలు పనిచేశామన్న దానిపై కాకుండా ఎంత నాణ్యతతో పనిచేశామన్న దానిపైనే ఉత్పాదకత ఆధారపడి ఉంటుందని ఆమె అన్నారు.

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్

తిరుపతిలో ఓ మహిళా కార్మికురాలు బేకరీకి వెళుతుంది.. ఉదయం 9 గంటలకు పనికి వెళితే రాత్రి 9 గంటలకే ఇంటికి వచ్చేది. నెలకు ఆమెకు ఇచ్చేది కేవలం 12వేల రూపాయలు మాత్రమే. సెలవు పెట్టిందంటే ఆరోజు వేతనం 'గోవిందా'. ఆ తల్లి వంట ఎపుడు చేయాలి, ఎపుడు బిడ్డల్ని చూసుకోవాలి.. షాపుల్లో పనిచేసే కార్మికులు వేలల్లో ఉన్నారు. ఉదయం 10 గంటలకు షాపుకు వెళితే, రాత్రి 10 గంటలకే వారు ఇంటికి వచ్చేది. రోజంతా నిలబడే పని చేయాల్సి ఉంటుంది. వీరికీ వేతనం 12-15వేల మధ్యనే. అలాగే రేణిగుంటలోని ఫ్యాక్టరీల్లో పనిచేసే కార్మికులకు షిఫ్ట్ డ్యూటీలు. మూడు షిఫ్ట్‌లు ఉంటాయి. వేతనం 12-15వేల మధ్య ఇస్తారు. భార్యాభర్తలు ఇద్దరూ పొరబాటున ఒకే ఫ్యాక్టరీలో పనిచేస్తే నెలలో ఒక వారమైనా ఇద్దరికీ ఒకే షిఫ్ట్‌లో పని వస్తేనే ఇంట్లో వాళ్లు కలిసి ఉంటారు. లేదంటే నెలరోజులకు ఒకట్రెండు సార్లు మాత్రమే ఆ భార్యాభర్తలు మాట్లాడుకునే పరిస్థితి. పిల్లలతో గడిపే పరిస్థితి. ఇక తిరుమల తిరుపతి దేవస్థానం ఉందంటే గతంలో పర్మినెంట్ ఉద్యోగ కార్మికులు 20వేలకు పైగా ఉండేవారు. ప్రస్తుతం రిటైర్ అయిన వారిని మినహాయిస్తే 8వేల లోపే ఉన్నారు. ప్రస్తుతం పనిచేస్తున్న వారంతా కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, శ్రీవారి సేవకులే. టిటిడి ఫారెస్టు విభాగంలో జీతాల పెంపులో వివక్ష విడనాడి, కనీస వేతనం ఇవ్వాలని దాదాపు మూడేళ్లకు పైగా సుదీర్ఘకాలం నిరసనలు తెలిపి ఎట్టకేలకు సాధించుకున్నారు. ఇక శ్రీవారి మెట్టు చిరువ్యాపారులైతే 320 రోజులుగా రిలేదీక్షలు జరుగుతూనే ఉన్నాయి. స్విమ్స్‌లో కాంట్రాక్టు కార్మికులు గత రెండేళ్లుగా డిజిగ్నేషన్‌లో చిన్న మార్పు వల్ల తమకు వేతనంలో వివక్ష చూపారంటూ రెండేళ్లుగా నిరసనలు తెలిపి, తాజా చర్చల్లో యాజమాన్యం ఒప్పుకునేలా చేశారు. విద్యుత్ కాంట్రాక్టు కార్మికులు సుదీర్ఘకాలంగా నిరసనలు తెలుపుతూనే ఉన్నారు. వీరంతా అడిగేది గొంతెమ్మ కోర్కెలు కాదు.. సుప్రీంకోర్టు చెప్పినట్లుగా 'సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి' అని మాత్రమే. స్కీం వర్కర్ల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. కనీస వేతనం అందదు. ప్రభుత్వ పథకాలకు దూరంగా ఉంచారు.

సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శి జిబిఎస్ మణ్యం, కందారపు మురళి నేతృత్వంలో తిరుపతి జిల్లాలో సార్వత్రిక సమ్మెకు సన్నాహాలు నెలరోజులుగా జరుగుతున్నాయి. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి వాణీశ్రీ, ఆప్కాస్ రాష్ట్ర అధ్యక్షులు జి.చిన్నబాబు, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు రాము, వ్యకాసం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి జనార్ధన్, రైతుసంఘం ప్రధాన కార్యదర్శి హేమలత నేతృత్వంలో కార్మిక కర్షక సార్వత్రిక సమ్మెను 9వ తేదీ బుధవారం జయప్రదం చేయనున్నారు. పారిశ్రామిక కార్మికులతో పాటు, స్కీమ్ వర్కర్లైన అంగన్వాడీ, ఆశ, మధ్యాహ్న భోజనం తదితరులతో పాటు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పోస్టల్, ఎల్ఐసి, బ్యాంకింగ్, ఫైనాన్స్ సెక్టార్లలో పనిచేస్తున్న ఉద్యోగులు సమ్మెలో పాల్గొంటారని, టీటీడీ పర్మినెంట్ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు నిరసనలు తెలియజేస్తారని, తోపుడుబండ్ల వ్యాపారులు, ఆటోలు బిల్డింగ్ కార్మికులు, ఆసుపత్రులలో పని చేసే కార్మికులు, యూనివర్సిటీలు, మున్సిపాలిటీలు, పంచాయతీలు, వీఎవోలు, సర్వ శిక్ష అభియాన్ ఉద్యోగులు, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ ఉద్యోగులు సమ్మెలో పెద్ద ఎత్తున పాల్గొంటారని తెలిపారు. సార్వత్రిక సమ్మెకు విద్యార్థిసంఘాలు సంఘీభావం ప్రకటించాయి.



తిరుపతి జిల్లాలో వరి సాగు విస్తారం. అయితే గిట్టుబాటు నిస్తేజం.. ఆరుగాలం కష్టపడి పండిస్తే ఉత్పత్తి ఎక్కువగా పండించారని వ్యాపారులంతా సిండికేట్ అయ్యి బస్తా (75 కేజీలు) 1600 గిట్టుబాటు అవుతుంది. అదే బహిరంగ మార్కెట్లో 25 కేజీల బస్తాబియ్యం 2600-1800 ధర పలుకుతోంది. అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి అన్న చందంగా రైతుల పరిస్థితి ఉంది. తాజాగా మామిడి రైతులు గిట్టుబాటు ధర లేక రోడ్లపైనే పంట పారబోయడం, తోటల్లోనే కాయలు కోయకుండా వదిలేసిన దయనీయ పరిస్థితులు ఈ ఏడాది కనిపించాయి. అదేమంటే ఉన్నతాధికారులు సైతం 'ఉత్పత్తి' ఎక్కువగా వచ్చిందని కుంటిసాకులు చెబుతున్నారే తప్ప, ఉత్పత్తి బాగా వచ్చినందుకు అభినందించి, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్న కనీస ఇంగితం లేకుండా ఉద్యానవన శాఖ వ్యవహరించింది. చెరకు క్రషింగ్ లేక పోవడంతో పంట సాగు విస్తీర్ణం తగ్గింది. పొలాలను బీడు పెట్టలేక తైలం చెట్లు పెట్టి రైతులు భవన నిర్మాణ పనులకు వెళుతున్నారు.



మున్సిపల్ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - వెంకటగిరి టౌన్

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు జీతాలు పెంచాలని, సమ్మె ఒప్పందాలకు జీవోలు ఇవ్వాలని, అక్రమాల రామారావును వెంటనే బదిలీ చేయాలని కోరుతూ మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. అక్రమంగా పదేళ్లుగా తిష్ట వేసుకుని ఉన్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును బదిలీ చేయాలని నినాదాలు చేశారు. ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ జీవో 36 ప్రకారం జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. 13వేల రూపాయలతో వారి కుటుంబాలు ఎలా గడవాలని ప్రశ్నించారు. 17 రోజుల సమ్మె కాలపు ఒప్పందాలకు వెంటనే జీవోలు ఇవ్వాలని, డైలీ వేజెస్ కార్మికులకు నాలుగు నెలల పెండింగ్ జీతాలను వెంటనే చెల్లించాలన్నారు. పదేళ్లుగా నిబంధనలకు విరుద్ధంగా వెంకటగిరిలోనే విధులు నిర్వహిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ రామారావును వెంటనే బదిలీ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పెంచలయ్య, ప్రసాద్, సుబ్రమణ్యం, రమణయ్య పాల్గొన్నారు.



వెంకటగిరిలో...

'మత్తు'లో పల్లెలు 'చిత్తు'

'ప్రొహిబిషన్, ఎక్సైజ్' శాఖ నిర్లక్ష్యం
పోటా పోటీగా బెల్ట్ షాప్‌ల నిర్వహణ
క్వార్టర్‌పై రూ.50 అధిక వసూలు
గంజాయి, మద్యానికి యువత బానిస

ప్రజాశక్తి - ఏర్పేడు



తాగేందుకు గుక్కెడు నీళ్లు లేని పల్లెలు కోకొల్లలు. కానీ మద్యం దొరకని పల్లెలు ఒక్కటి లేదంటే అతిశయోక్తి కాదుపచ్చని పల్లెల్లో నీరు ఎరులై పారాలి గానీ మద్యం ఏరులై పారుతోంది. ఒకటికి రెండు బెల్టుషాపుల నిర్వహణతో మందు బాబుల ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతుంది. మద్యం నియంత్రణపై అవగాహన కల్పించాల్సిన ఎక్సైజ్ శాఖ ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తుందన్న ఆరోపణలున్నాయి. మద్యం దుకాణాల యాజమాన్యమే ఆదాయాన్ని పెంచుకునేందుకు బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిండికేట్ వ్యవస్థ ఏర్పడటం వలన మద్యం దుకాణం నిర్వాహకులు బెల్ట్ షాపులను ప్రోత్సహిస్తున్నారని, అందువలన గ్రామాలలో విచ్చలవిడిగా బెల్ట్ షాపులు పుట్టగొడుగుల్లా ఏర్పడ్డాయని, ఈ వ్యవస్థ వలన ప్రభుత్వ ఆదాయానికి తూట్లు పడుతున్నాయని విశ్లేషకులు చెబుతున్నారు.

గతేడాది అక్టోబర్ లో కూటమి ప్రభుత్వం అమలు చేసిన మద్యం పాలసీ విధానం ద్వారా మద్యం దుకాణాల కొరకు ఏర్పేడు మండలం నుంచి 36 మంది దరఖాస్తులు చేసుకున్నారు. తిరుపతి జిల్లా కేంద్రంలో కలెక్టర్, ఎక్సైజ్ అధికారులు నిర్వహించిన లాటరీ విధానంలో మండలంలో ఏడుగురు 7 మద్యం షాపులను దక్కించుకున్నారు. వీటిలో పాపా నాయుడు పేట 2, రాజుల కండ్రిగ 1, అంజిమేడు 1, ఏర్పేడు 1, పంగూరు 1, పల్లంపేట 1 ఉన్నాయి. మండలంలో 40 పంచాయతీలున్నాయి. మండలంలో బెల్ట్ షాపుల దందా "మూడు బాటిల్లు ఆరు కాసులు"గా తయారయ్యి ఏడాది కాలంలో నే ఒక్కో గ్రామంలో మూడు నుండి నాలుగు బెల్ట్ షాప్‌లు ఏర్పడ్డాయని ఆరోపణలన్నాయి. ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి పల్లెల్లో కరోనా వైరస్‌లా వ్యాప్తి చెందుతున్న గొలుసు దుకాణాలపై దాడులు నిర్వహించి, నియంత్రణకు అడ్డుకట్ట వేయాలని మహిళలు కోరుతున్నారు.

24X7 అందుబాటులో క్వార్టర్ బాటిల్

సహజంగా వైద్యశాఖ 24 గంటలూ పల్లెల్లో అందుబాటులో ఉంటే ఆరోగ్యం బాగుంటుంది. అయితే 24 గంటలూ మద్యం షాపులు మాత్రం అందుబాటులో ఉంటున్నాయి. అనధికారంగా పుట్టగొడుగుల్లా వ్యాప్తి చెందిన గొలుసు దుకాణాలు ఒక్కో గ్రామంలో 3 నుండి 4 వరకు ఏర్పడి మద్యం ఏరులై పారుతుంది. మద్యం దుకాణాల్లో ఉదయం 10గం. నుండి రాత్రి 9గం. వరకు దొరుకుతుందేమో కానీ, పల్లెల్లో మాత్రం 24 గంటలు తలుపు తడితే క్వాటర్ చేతికి వస్తుంది.దీంతో మద్యం ప్రియులు 24 గంటలు నిషాలో మునిగి తేలుతున్నారు. కొందరు మహిళలైతే మంగళ సూత్రాలను అరచేతిలో పెట్టుకుని జీవనం సాగిస్తున్నారు.

క్వాటర్ పై రూ.50 అధిక వసూళ్లు....

మద్యం దుకాణదారులు బాటిల్ ఎమ్మార్పీ ధర కన్నా రూ.10 పెంచి గొలుసు నిర్వాహకులకు అధిక మొత్తంలో విక్రయిస్తున్నారు. ఈ మద్యాన్ని గ్రామాలకు తీసుకొచ్చి క్వాటర్ పై రూ.50 రేటు పెంచి మందు బాబులకు విక్రయిస్తున్నారు. రోజంతా కష్టపడే కూలీలు మద్యానికి బానిసైన, మద్యానికి అలవాటైన మరికొందరు ధరను పరిగణలోకి తీసుకోకుండా ఎంతైనా వెచ్చించి కొనుగోలు చేసే తాగుతున్నారు. ఇలా మద్యానికి బానిసై జేబులు ఖాళీ చేసుకుంటున్నారు. దీనికి ప్రతిఫలం వారి కుటుంబాలు ఆర్థికంగా చితికి పోతున్నాయి. మద్యం షాపును ఉదయం 10గం. నుండి రాత్రి 9 గం. వరకే కొనసాగిస్తారు. దీనిని అదునుగా చూసుకుని బెల్ట్ షాప్ నిర్వాహకులు పల్లెల్లో పెళ్లిళ్ల, ఉత్సవాలు ఇతర కార్యకలాపాలు నిర్వహిస్తున్నప్పుడు రూ.100 మద్యం బాటిల్ ను రూ.200 వరకు విక్రయిస్తున్నారని మందు బాబులే చెబుతున్నారు.

పుణ్యక్షేత్రం..పద్మవ్యూహం..!

• శ్రీకాళహస్తిలో నిత్యం 'ట్రాఫిక్ టాపిక్' • కలగానే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిని ట్రాఫిక్ భూతం పట్టి పీడిస్తోంది.. ట్రాఫిక్ పద్మవ్యూహంలో చిక్కుకుని పట్టణవాసులు అల్లాడిపోతున్నారు..ఏటా పెరుగుతున్న జనాభా, వాహనాలకు తగ్గట్టుగా రోడ్ల విస్తరణ జరగకపోవడంతో ట్రాఫిక్ టాపిక్ నిత్యకత్యంగా మారింది. ఎపుడో బ్రిటీష్ కాలం నాటి వీధులే నేటికీ వినియోగిస్తుండడంతో ప్రజలను ట్రాఫిక్ కష్టాలు వదలడం లేదు. పట్టణంలో వాణిజ్య భవనాలు, బహుళ అంతస్తుల నిర్మాణాలకు అనుమతులు తీసుకునే క్రమంలో యాజమాన్యాలు, ఇచ్చే క్రమంలో మున్సిపల్ అధికారులు నిబంధనలు పాటించకపోవడం కూడా పుణ్యక్షేత్రంలో ట్రాఫిక్ కష్టాలకు ఒక కారణంగా నిలుస్తోంది. అంతేకాకుండా లక్షకు పైగా జనాభా, వేల సంఖ్యలో భక్తులు, వాహనాలతోటి నిత్యం రద్దీగా ఉండే శ్రీకాళహస్తి పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేకించి ఓ స్టేషన్ లేకపోవడం ప్రజలను బాధిస్తోంది. ఫలితంగా ట్రాఫిక్ నియంత్రణకు పోలీసు శాఖ శక్తివంచన లేకుండా కషి చేస్తున్నా ప్రయోజనం మాత్రం అంతంత మాత్రమేనని చెప్పాల్సి వస్తోంది.

పట్టని నిబంధనలు

పట్టణంలోని వీధులు ఇరుకుగా ఉండడంతో ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయి. ముఖ్యంగా జయరామారావు వీధి, బాబూ అగ్రహారం, భాస్కరపేట, కొత్తపేట, సన్నిధి వీధి, నాలుగు మాడా వీధులు ఇరుకుగా ఉండడంతో తరచూ ట్రాఫిక్ స్తంభిస్తోంది. జయరామారావు వీధి ఇరుకుగా ఉన్నా బహుళ అంతస్తులు, బ్యాంకులు నిర్వహించేందుకు అనుమతులిచ్చారు. అదేవిధంగా ఈ వీధిలోనే వాణిజ్య పరమైన అతి పెద్ద ప్రొవిజన్ స్టోర్ కు, ఎలక్ట్రానిక్ షాప్ కు అనుమతులిచ్చారు. అయితే పార్కింగ్ కు సరైన స్థలం లేకపోవడంతో భారీ వాహనాలు వెళ్లిన ప్రతిసారీ ట్రాఫిక్ అంతరాయాలు ఏర్పడుతున్నాయి. అదేవిధంగా బాబు అగ్రహారం వీధిలో ఓ బహుళ జాతి వాణిజ్య సముదాయ భవనానికి అనుమతులు ఇచ్చారు. అక్కడ కూడా సరైన పార్కింగ్ సౌకర్యం లేకపోవడంతో ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తున్నాయి. ఇదే తరహాలో పట్టణ వ్యాప్తంగా నిబంధనలు పట్టించుకోని ఎంతోమంది వీధుల్లోకి వ్యాపారాలను తీసుకొస్తుండడంతో ట్రాఫిక్ నిత్యకత్యంగా మారింది.

కలగానే ట్రాఫిక్ పోలీస్ స్టేషన్

శ్రీకాళహస్తి పట్టణంలో దాదాపు లక్షకు పైగా జనాభా ఉన్నారు. రోజూ 40 వేలకు పైగా భక్తులు ముక్కంటి దర్శనార్థం శ్రీకాళహస్తికి వస్తుంటారు. అదేవిధంగా వాహనాల సంఖ్య ఉన్నవాటికన్నా పదింతలు పెరిగాయి. ఈ నేపథ్యంలో పట్టణానికి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ అవసరం ఎంతో ఉంది. పట్టణ ట్రాఫిక్ అవసరాల మేరకు పోలీసులను నియమించక పోవడంతో రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. ఎగుడు దిగుడుగా వాహనాలు నడుపుతూ రాకపోకలు సాగిస్తూ ట్రాఫిక్ కష్టాలు సష్టిస్తున్నా అడగలేని పరిస్థితి. ప్రస్తుతం పట్టణంలో 16 మంది పోలీసులు ట్రాఫిక్ విధులు నిర్వర్తిస్తున్నారు. ఒక్కో పోలీస్ స్టేషన్ నుంచి నలుగురు కానిస్టేబుల్ లను విధులకు పంపాల్సి వస్తుంది. ఒక ఏఆర్ ఏఎస్ఐ ట్రాఫిక్ విభాగానికి బాధ్యులుగా ఉన్నారు. వీరికి కొన్ని చోట్ల ముక్కంటి ఆలయ భద్రతా సిబ్బంది సహకారమందిస్తుండడంతో కొద్దో గొప్పో రాకపోకలకు క్రమబద్ధీకరిస్తున్న పరిస్థితి కనబడుతోంది. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తికి ఓ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.



నిత్యం ట్రాఫిక్‌లో ప్రయాణికులకు, వాహనదారులకు కష్టాలు



చదువుకు దూరం చేయొద్దు : తల్లిదండ్రులు

ప్రజాశక్తి - దొరవారిసత్రం

విద్యా శాఖలో తలపెట్టిన రేషన్ లైజేషన్ విధానాన్ని అమలు చేయడం విరమించుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు మంగళవారం మండల విద్యాశాఖ అధికారి కష్ణయ్యకు వినతిపత్రం అందజేశారు. మండల పరిధిలోని టపాఇండ్లు వద్ద ఉన్న ముత్తరాశి పాలెం లోని ప్రాథమిక పాఠశాలను తల్లంపాడు ప్రాథమిక పాఠశాలలో విలీనం చేశారు. మత్తరాశి పాలెం వద్ద ఉన్న పాఠశాలలోని 3,4,5, తరగతులు చదువుతున్న విద్యార్థులు సుమారు 30 మంది ఉన్నారు. వీరిని 2 కిలోమీటర్ దూరంలో ఉన్న తల్లంపాడు ప్రాథమిక పాఠశాలలో విలీనం చేయడం వల్ల ఈ విద్యార్థులు అక్కడికి పోలేక విద్యకు దూరమవుతున్నారు. తల్లంపాడు పాఠశాలకు వెళ్లాలంటే రెండు కిలోమీటర్లు దూరంలో ఒక కిలోమీటర్ దూరం హైవే జాతీయ రహదారిపై పోవలసి ఉంది. వాహనాల ప్రమాదం పొంచి ఉంటుందని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఎంఈఓ కష్ణయ్య స్పందిస్తూ మండల స్థాయిలో విద్యార్థుల తల్లిదండ్రులు పాఠశాలల విలీనంపై జరుగుతున్న ఆందోళనలను, వినతులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామన్నారు.

మతిలేని నిందితుడికి చికిత్స చేయాలి : సైకాలజిస్ట్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

తిరుపతి కపిలతీర్థం వద్ద భిక్షాటన చేస్తున్న శేఖర్ మతికి కారకుడైన మతి స్థిమితం లేని (సైకో) వ్యక్తికి తక్షణం చికిత్స చేయించాలని ప్రముఖ సైకాలజిస్ట్ డాక్టర్ ఎన్ బి సుధాకర్ రెడ్డి పోలీసులకు సూచించారు. సోమవారం ఉదయం జరిగిన ఘర్షణలో రెచ్చిపోయి ఆయన శేఖర్ పై కర్రతో దాడి చేశారని తెలిసిందని అన్నారు. అయితే అతన్ని వలవేసి పట్టుకున్న అలిపిరి పోలీసులను అభినందించాలి అన్నారు. అయితే అతడిని పట్టుకునే క్రమంలో కొందరు రాళ్లతో దాడిచేయడం అమానుషం అన్నారు. ఆయనపై హత్యానేరం కింద కేసు పెట్టి చేతులు దులుపుకోకుండా కోర్టు అనుమతితో రుయా లేదా స్విమ్స్ ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయించి, మానసిక పునరావాస కేంద్రాలకు తరలించాలని సూచించారు.

మొక్కలే మానవ మనుగడకు ప్రాణం : కలెక్టర్

ప్రజాశక్తి - రామచంద్రాపురం

మొక్కలు మానవ మనుగడకు మూలాధారమని కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ అన్నారు. రామచంద్రాపురం మండలం కుప్పంబాదూరు సమీపంలోని ప్రాణయోగ ఆశ్రమంలో వృక్షారోపణ-2025 కార్యక్రమాన్ని ప్రారంభించి రావి, మర్రిచెట్లను నాటారు. ఆశ్రమ నిర్వాహకులు కలెక్టర్‌కు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అడవులలో మొక్కల పెంపకానికి ముందుకొచ్చిన ప్రాణయోగ ఆశ్రమ పీఠాధిపతి కైలాస్ గురుజీకి అభినందనలు తెలిపారు. సమాజంలో ప్రతి ఒక్కరూ పచ్చదనాన్ని పెంపొందించడంకోసం కృషి చేస్తే పర్యావరణ పరిరక్షణ, సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తిరుపతి ఐఐటి డైరెక్టర్ కే ఎస్ సత్యనారాయణ, ఐఆర్ఎస్ అధికారిణి పాయల్ గుప్తా, భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ డాక్టర్ సత్యనారాయణరాజు, ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా చీఫ్ సెక్యూరిటీ ఆఫీసర్ పి. రాజేంద్ర ప్రసాద్, రాయుడు. ఎంపీడీవో ఇందిరమ్మ, డిప్యూటీ తహసిల్దార్ అన్వర్ భాష, ఏపీవో సుజాత, వ్యవసాయ శాఖ అధికారిణి మమత, వీఆర్వో రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పథకాన్ని వినియోగించుకోండి


ప్రజాశక్తి-తిరుపతి(మంగళం):

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంను ప్రజలు వినియోగించుకోవాలని ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారు. మంగళవారం తిరుమల నగర్ గ్రామపంచాయతీ సచివాలయం వద్ద పండ్ల తోటల పెంపకానికి ఉపాధి హామీ పథకం అందించే చేయూతలో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ సచివాలయం పరిసర ప్రాంతాలను ఉపాధి హామీ నిధులతో సుందరంగా తీర్చిదిద్ది, స్థానికులకు ఉపయోగపడేలా తీర్చిదిద్దాలన్నారు. పంచాయతీ పరిధిలోని కోళ్ల ఫారాలలో ఉన్న ప్రజలతో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి ఏడాది పాలనపై ప్రజలకు కరపత్రాలను పంచి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రూరల్ మండల అధ్యక్షులు ఈశ్వర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గోపీనాథ్, మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, గ్రామ కమిటీ టిడిపి అధ్యక్షులు గోవిందరాజులు, ప్రధాన కార్యదర్శి చెన్నరాయప్ప తదితరులు పాల్గొన్నారు. ఫోటో: మొక్క నాటుతున్న ఎమ్మెల్యే పులివర్తి నాని.

పండ్ల తోటల సాగుతో రైతులకు ఆర్థికాభివృద్ధి:ఎంపీడీవో

నాయుడుపేటలో.. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా పండ్ల తోటల పెంపకం చేపట్టి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించాలని నాయుడుపేట ఎంపీడీవో కే.సురేష్ బాబు అన్నారు.మంగళవారం నాయుడుపేట మండలంలోని వెంగమాంబ పురం గ్రామంలో ఏపీ ఓ ఆధ్వర్యంలో రైతు సుంకర.విజయకుమార్ పొలాల్లో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల తోటల పెంపకంలో భాగంగా ఎంపీడీవో కె.సురేష్ బాబు,నాయుడుపేట మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు సన్నారెడ్డి.చంద్రశేఖర్ రెడ్డి,టిడిపి మండల ప్రధాన కార్యదర్శి చిట్టేటి.చెంచయ్య లు నిమ్మ మొక్కలు నాటారు.

జగన్ పర్యటన... జర జాగ్రత్త..! : ఎస్‌పి



విలేకర్ల సమావేశంలో ఎస్పీ మణికంఠ చందోలు


ప్రజాశక్తి- బంగారుపాళ్యం:

శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. మంగళవారం స్థానిక పోలీసు స్టేషన్‌లో విలేకరుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి బంగారుపాళ్యం మార్కెట్ యార్డు రైతులతో ముఖాముఖి కార్యక్రమం జరుగుతుందని, ఇందకు తగిన బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. అదేవిధంగా కొత్తపల్లి సమీపంలో హెలిప్యాడ్ ఏర్పాటు చేశారని అక్కడ 30 మందికి అనుమతి ఇచ్చామని, మార్కెట్ యార్డ్‌కు 500 మందికి అనుమతులు మంజూరు చేశామని తెలిపారు. ఇవి కాకుండా ప్రజాప్రతినిధులు జనసమీకరణ చేపట్టేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు వచ్చిన సమాచారాల మేరకు 370మందికి నోటీసులు జారీ చేశామని ప్రజలు ఎవరు ఈ కార్యక్రమానికి రావలసిన పనిలేదని ఇది రైతులకు మాత్రమే కార్యక్రమం అన్నారు. ప్రభుత్వ ఆదేశాలను బేఖాతర్ చేసి ప్రజలను జన సమీకరణ చేపడితే చట్టపరమైన కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పలమనేరు డీఎస్పీ దేగ ప్రభాకర్, సీఐ కత్తి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థుల దాతృత్వం

ప్రజాశక్తి - క్యాంపస్

శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థులు 16 కోట్ల రూపాయలతో, 500 మంది విద్యార్థులు ఉండేలా వసతి సముదాయాన్ని నిర్మించ తలపెట్టారు. మొదటి దశ పనులు పూర్తయ్యాయి. ఈ బిల్డింగ్ సముదాయాన్ని ప్రారంభోత్సవం రోజున 'శ్రీ పద్మావతి మహిలా హాస్టల్' అని నామకరణం చేయనున్నట్లు వెల్లడించారు. ఎస్వీయూ ఇన్‌ఛార్జి వీసీ ఆచార్య అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతినాయుడు మాట్లాడుతూ ఇంజినీరింగ్ పూర్వ విద్యార్థుల ఐక్యత, వారికి మాతృసంస్థపై ఉన్న ప్రేమకు నిదర్శనం అని అన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య జి.శ్రీనివాసులు, పూర్వ విద్యార్థుల కమిటీ నుంచి ఆచార్య దామోదర్‌రెడ్డి, ఆచార్య కెఎం భాను, ఆచార్య హేమ ఆహ్వాన పత్రికను విశ్వ విద్యాలయ అధికారులకు అందజేశారు.



కూటమి ప్రభుత్వ మోసాలను వివరిద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - వెంకటగిరి: ఇచ్చిన హామీలను కూటమి నేతలు మర్చిపోయారని వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రామ్ కుమార్ రెడ్డి విమర్శించారు. నేదురుమల్లి నివాసం, ఎన్‌జేఆర్ భవన్‌లో మంగళవారం 'రీకాల్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమంపై నియోజకవర్గస్థాయి వైఎస్ఆర్సిపి కార్యకర్తల సమావేశం నిర్వహించారు. కూటమి సర్కారు చేసిన మోసాలను ప్రజలకు వివరించేందుకు క్షేత్రస్థాయిలో వైఎస్ఆర్సిపి శ్రేణులు సిద్ధంగా ఉండాలని రామ్ కుమార్ రెడ్డి సూచించారు. కార్యక్రమ ముఖ్య ఉద్దేశం, క్షేత్రస్థాయిలో నిర్వహణ తదితర అంశాలపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ సీనియర్ నాయకుడు డాక్టర్ బొలిగర్ల మస్తాన్ యాదవ్, మున్సిపల్ చైర్పర్సన్ నక్కా భానుప్రియ, వైస్ చైర్మన్ సేతు రాశి బాలయ్య, నాయకులు నక్కా వెంకటేశ్వరరావు, చిట్టేటి హరికృష్ణ, పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి మునయ్య కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - వాకాడు : మే 7వ తేదీ పిడుగుపాటుకు మృతి చెందిన రెడ్డి మునయ్య కుటుంబ సభ్యులకు గూడూరు ఎమ్మెల్యే ఆధ్వర్యంలో బాలిరెడ్డిపాలెం గ్రామ నాయకులు గుండాల శ్యాంసుందర్ రెడ్డి, తహశీల్దార్లు 4 లక్షల రూపాయల చెక్కును మంగళవారం అందించారు.

బేస్ బాల్ పోటీలకు జట్ల ఎంపిక

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఉమ్మడి చిత్తూరు జిల్లా బేస్ బాల్ పురుషులు, మహిళల జట్ల ఎంపిక మంగళవారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మంగళం ట్రెండ్స్‌లో జరిగింది. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కేశవులు నాయుడు ఆధ్వర్యంలో జరిగిన జట్ల ఎంపికలో జిల్లా నలుమూలల నుండి 150 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా బేస్ బాల్ సంఘం అధ్యక్షులు సోము రవికుమార్, పీపుల్ చారిటీ అధ్యక్షులు మోహన్ హాజరై ఎంపిక ప్రక్రియను పర్యవేక్షించారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 12 నుండి 14 వరకు సత్యసాయి జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి ఎంపిక పోటీలలో పాల్గొంటారన్నారు. ఈ జట్ల ఎంపికలో తిరుపతి, చిత్తూరు జిల్లాలకు 18 మంది పురుషులను, 18 మంది మహిళల చొప్పున ఎంపిక చేయడం జరిగిందన్నారు. ఈ బేస్ బాల్ జట్ల ఎంపిక కార్యక్రమంలో తిరుపతి, చిత్తూరు జిల్లాల బేస్ బాల్ సంఘం కార్యదర్శులు సాంబశివరావు, ప్రకాష్, నూరుద్దీన్, నందకుమార్, రామచంద్రయ్య, శ్రీధర్ పాల్గొన్నారు.

ఆర్‌సిడిఎస్ జిల్లా మహిళా అధ్యక్షురాలికి సన్మానం



ప్రజాశక్తి - నాయుడుపేట: రెడ్డి కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ (ఆర్‌సిడిఎస్) తిరుపతి జిల్లా మహిళా అధ్యక్షురాలుగా దువ్వూరు హారతి రెడ్డి నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఆమె మంగళవారం నాయుడుపేటలోని వైసీపీ జిల్లా కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వైసిపి నాయకులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. ఆమె మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవిలో నియమించిన ఆర్ సి డి ఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎర్రపురెడ్డి సురేందర్ రెడ్డికి, సహకరించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు.

'కదలని చెత్త ..' ప్రజాశక్తి వార్తకు స్పందన



ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : 'కదలని చెత్తాచెదారం' ప్రజాశక్తి వార్తకు మున్సిపల్ శాఖ స్పందించిది. ప్రధాన కూడలి, జండా మాను వీధిలో బాలికల పాఠశాల, షాపు వీధి ఎక్స్టెన్షన్ వద్ద సోమవారం మున్సిపల్ సిబ్బంది చెత్త, చెదారాలను తొలగించి శుభ్రం చేశారు. దీంతో స్థానికులు, ప్రజాశక్తికి, మున్సిపల్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

వసుధ ప్రియకు డాక్టరేట్



ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా వర్శిటీ విద్యా విభాగం పరిశోధక విద్యార్థిని వసుధ ప్రియకు వర్శిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆ విభాగం ఆచార్యులు సునీత బాయ్ మార్గదర్శకత్వంలో "ఇంప్లిమెంటేషన్ ఆఫ్ సిసిఇ ఇన్ ప్రైమరీ స్కూల్స్ ఆఫ్ వరంగల్ డిస్ట్రిక్ట్ ఇన్ రిలేషన్ టు టీచర్'స్ అవేర్నెస్, ఆటిట్యూడ్ అండ్ స్ట్రెస్" అనే అంశం పై పరిశోధన సమర్పించినందుకు గాను ఆమెకు డాక్టరేట్ లభించిందని వర్శిటీ డీన్ అఫ్ ఎక్సమినేషన్స్ తెలిపారు.

టాటా మినీ ట్రక్ ఎస్ ప్రో ఆవిష్కరణ



ప్రజాశక్తి - తిరుపతి సిటీ : టాటా మోటార్స్‌లో 4-చక్రాల మినీ-ట్రక్ ఏస్ ప్రోను ఆ సంస్థ ప్రతినిధులు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టాటా మోటార్స్ సరికొత్త టాటా ఏస్ ప్రోను ప్రారంభించడం ద్వారా కార్గో మొబిలిటీలో కొత్త మైలురాయిని సృష్టిస్తూ, చిన్న కార్గో మొబిలిటీలో పరివర్తన యుగానికి నాంది పలికిందన్నారు. కేవలం రూ.3.99 లక్షల సాటిలేని ప్రారంభ ధరతో, టాటా ఏస్ ప్రో భారతదేశంలో అత్యంత సరసమైన నాలుగు చక్రాల మినీ ట్రక్ అని, ఇది అసాధారణ సామర్థ్యం, సాటిలేని బహుముఖ ప్రజ్ఞ, ఉన్నతమైన విలువను అందిస్తుందన్నారు. సిఎన్జి, పెట్రోల్, ఎలక్ట్రిక్ వేరియంట్లలో ఈ వాహనం లభిస్తుందని తెలిపారు. వ్యాపార అవసరాలకు అనువైన వాహనమన్నారు. ఈ కార్యక్రమంలో ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిరీష్ వాఘ్, బిజినెస్ హెడ్ పినాకి హల్దార్, తదితరులు పాల్గొన్నారు.

టీటీడీ ఏఈఓ రాజశేఖర్ బాబు సస్పెన్షన్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టీటీడీలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ ఏ.రాజశేఖర్ బాబు, ఆయన ప్రవర్తనపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో సస్పెండ్ గురయ్యారు. తిరుపతి జిల్లా, పుత్తూరులోని స్వగ్రామంలో రాజశేఖర్ బాబు ప్రతీ ఆదివారం స్థానిక చర్చి ప్రార్థనల్లో పాల్గొంటున్నారని సమాచారం. ఈ వ్యవహారంతో టీటీడీ ఉద్యోగిగా ఆయన సంస్థ ప్రవర్తనా నియమావళిని పాటించలేదని భావించడమేకాక, హిందూ ధార్మిక సంస్థకు ప్రాతినిధ్యం వహించే ఉద్యోగి అయివుండి బాధ్యతారహితంగా వ్యవహరించడమని టీటీడీ యాజమాన్యం భావించింది. ఈ క్రమంలో టీటీడీ విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికను, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం ఆయనపై శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు ఆయన్ను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు టిటిడి యాజమాన్యం ప్రకటనలో వెల్లడించింది.

వైఎస్ఆర్‌కు ఘన నివాళి

పుత్తూరు - వైయస్సార్ జయంతిని పురస్కరించుకుని, పట్టణ వైసీపీ నేతల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన వేడుకల్లో



మాజీ మంత్రి రోజా సోదరుడు కుమారస్వామి రెడ్డి పాల్గొన్నారు. పున్నమి సర్కిల్ వద్ద ఏర్పాటు చేసిన వైఎస్ఆర్ విగ్రహానికి నివాళులర్పించారు.

ప్రజాశక్తి - వాకాడు : దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం వాకాడు అశోక పిల్లర్ సెంటర్ వద్ద వైసీపీ మండల కన్వీనర్ నేదురుమల్లి ఉదయ్ శేఖర్ రెడ్డి, సీనియర్ రాజకీయ నాయకుడు కొడవలూరు దామోదర్ రెడ్డిలు నివాళులర్పించారు.

చిన్నగొట్టిగల్లు - చిన్నగొట్టిగల్లులో వైసీపీ నాయకులు వైఎస్సార్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైయస్సార్ అంటే పేరు కాదు ఒక బ్రాండ్ అన్నారు.

బుచ్చినాయుడుకండ్రిగ - బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో దివంగత నేత డాక్టర్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

గూడూరు - గూడూరు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వైయస్సార్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు పంటా శ్రీనివాసులు రెడ్డి నివాళి ఆర్పించారు.

సాధుపేట, శాంతినగర్ వద్ద ఉన్న వైయస్ఆర్ విగ్రహానికి ఎమ్మెల్సీ మేరీగ మురళి, నాయకులు నివాళులర్పించారు.

నాయుడుపేట - నాయుడుపేటలోని మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య క్యాంపు కార్యాలయంలో వైయస్ఆర్ జయంతి వేడుకలను నిర్వహించారు. పాత బస్టాండ్ వద్ద వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వైసీపీ యువజన విభాగం ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా కేంద్ర కార్యాలయంలో మంగళవారం జరిగిన రక్తదాన శిబిరంలో సూళ్లూరుపేట నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆదేశాల మేరకు రక్తదాన శిబిరంలో పాల్గొని రక్తదానం చేయడం ఆనందంగా ఉందని పాలేటి నాగార్జున తెలిపారు.

దొరవారిసత్రం - దొరవారిసత్రం మండల కేంద్రంలో



మంగళవారం దివంగత మహానేత మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వైయస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలను నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షులు అల్లూరు రాహుల్ రెడ్డి చిరస్థాయిగా నిలిచిపోయిన ఏకైక నాయకుడు వైయస్సార్ అన్నారు.

రామచంద్రాపురం - మంగళవారం చంద్రగిరి నియోజకవర్గం, రామచంద్రాపురం, చంద్రగిరి, పాకాల, తిరుపతి రూరల్ మండలాలలో వైయస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జయదేవ నాయుడు తదితర నాయకులు పాల్గొన్నారు.

తిరుపతి(మంగళం)- వైయస్సార్ జయంతి వేడుకలను మంగళంలో మంగళవారం స్థానిక వైసీపీ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. మాజీ తిరుపతి రూరల్ మండలం ఎంపీపీ చిలమంద మునికృష్ణయ్య, మంగళం డివిజన్ వైసీపీ అధ్యక్షులు నారాయణరెడ్డి, శివశంకర్ రాజు, లక్ష్మీనారాయణ తదితర వైసీపీ నాయకులు, కార్యకర్తలు వైయస్సార్‌కు నివాళి అర్పించారు.

ఏర్పేడు - వైయస్సార్ జయంతి వేడుకలు ఏర్పేడు మండల కేంద్రంలో, యండి పుత్తూరులో, పాతవిరాపురంలోని వైయస్సార్ విగ్రహాల వద్ద మండల వైసీపీ నాయకులు, కార్యకర్తలు నివాళి అర్పించారు.

క్యాంపస్ - యస్వీయు ప్రధాన ద్వారం వద్ద వైయస్సార్ జయంతి వేడుకలను వైయస్సార్ విద్యార్థి విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పోతు మురళీధర్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి




ముఖ్య అతిథులుగా వైసీపీ రాష్ట్ర ప్రచార కమిటీ వర్కింగ్ ప్రెసిడెంట్ హరిప్రసాద్ రెడ్డి, విద్యార్థి నాయకులు వైయస్సార్‌కు నివాళి అర్పించారు.

పోరాటాల ఫలితంగానే భూములు వచ్చాయి



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: ఎర్రజెండా పోరాటాల ఫలితంగానే దేశంలో అనేక చట్టాలు వచ్చాయని ఆ చట్టాల ద్వారానే పేద ప్రజలకు, కార్మిక, కర్షక, మహిళా విద్యార్థి యువజను లకు రక్షణగా ఉంటున్నాయని సిపిఐ నాయకులు చిన్నరాజా, కత్తి ధర్మయ్యలు పేర్కొన్నారు. ఆ చట్టాలను ప్రభుత్వాలు నీరుగారుస్తున్నారని ఆరోపించారు. మంగళ వారం కన మనం బేడు, దళితవాడ పేదలకు ఇంటి స్థలాలు మంజూరు చేయాలని అర్జీలు రాశారు. ఎమ్మార్వో కార్యాలనికి అర్జీదారులు వెళ్లి ధర్నా నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ కనమనం బేడు గ్రామ లెక్క దాఖలా సర్వే నంబర్ 252.253.254లో గల ప్రభుత్వ భూమిని పేదలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ భూములు కబ్జాకు గురవుతుంటే పోలీసులు, రెవెన్యూ అధికారులు చూసిచూన్నట్టుగా వ్యవహరించారని ఆవేదన వ్యక్తం చేశారు. దళితులు కబ్జాదారులు వేసిన కంచిని తొలగిస్తే 10 మందిపై కేసులు పెట్టడం దారుణమన్నారు. కేసులు ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ సత్యవేడు నియోజకవర్గ కార్యదర్శి చిన్ని రాజు మాట్లాడుతూ ఇళ్ల స్థలాల దరఖాస్తులను పేదవారి దగ్గరనుంచి స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఇళ్ల స్థలాల కోసం జరిగే పోరాటంలో పేదలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచి షణ్ముగం, రమణయ్య, ముని చంద్ర, ధనంజయులు, సుబ్రహ్మణ్యం, వీర రాఘవులు, దేవకుమార్, మహిళలు పాల్గొన్నారు.

పింఛనిచ్చి పుణ్యం కట్టుకోండి సారూ..



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఏడాదిగా మాయదారి జబ్బు బారిన పడి నరకం అనుభవిస్తున్నా..రెండు కిడ్నీలు పాడై నడవలేకున్నా..ఏ పనీ చేయలేకున్నా..పింఛన్ మంజూరు చేసి కొంచెం పుణ్యం కట్టుకోండి సారూ.. అంటూ తొట్టంబేడు మండలంలోని బోనుపల్లి దళితవాడకు చెందిన అర్ధమాల రామయ్య అధికారులకు విజ్ఞప్తి చేశారు. మంగళవారం బోనుపల్లిలో సుపరిపాలనకు తొలిఅడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రామయ్య నాయకులు, అధికారుల ఎదుట తన గోడును వెళ్ళబోసుకున్నారు. పింఛన్ మంజూరు చేస్తే కాస్తయినా కుటుంబానికి ఆదరువుగా ఉంటుందని రామయ్య కోరారు. రామయ్య కష్టం విన్న టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాలి చలపతి నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వాడపల్లి జయచంద్ర నాయుడు, మాజీ సర్పంచ్ దావులూరి రామానాయుడు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ కార్యకర్తలు రాజేంద్ర, ఉమాపతి, బాలచంద్ర, బత్తెయ్య తదితరులు పాల్గొన్నారు.

సమ్మెను జయప్రదం చేయండి : సిపిఎం



ప్రజాశక్తి - దొరవారి సత్రం : మండల పరిధిలోని శ్రీ ధనమల్లిలో మంగళవారం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు ఇంటింటికి వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు, రైతులకు, కార్మికులకు చేస్తున్న అన్యాయం గురించి ప్రజలకు అవగాహన కలిగించారు. లేబర్ కోడ్ తీసుకుని వచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తున్నాయని, శ్రమ దోపిడీ చేస్తూ ఉన్నాయని ఆరోపించారు. పంటకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా రైతుల కడుపులు కొడుతున్నారన్నారు. సూళ్లూరుపేట, తడ, దొరవారిసత్రం మండలాల్లో కిడ్నీ వ్యాధిగ్రస్తులు ఎక్కువమంది ఉన్నారని, ప్రభుత్వం గుర్తించి సూళ్లూరుపేటలో కిడ్నీ వ్యాధిగ్రస్తులకు సంబంధించిన వంద పడకల ఆసుపత్రిని నిర్మించే విధంగా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. 9వ తేదీన జరుగునున్న అఖిలభారత్ సార్వత్రిక సమ్మెలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డప్పు కళాకారుల సంఘం రాష్ట్ర నాయకులు కె.వి మున్నెయ్య, కె.వి.పి.ఎస్ నాయకులు డమాయి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి రూ.50 వేలు విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వర స్వామి నిత్యాన్నదాన పథకానికి ద్రాక్షారామానికి చెందిన సీతామహాలక్ష్మి దంపతులు మంగళవారం రూ 50 వేలు విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ అధికారులకు అందజేసి అన్నదాన పథకానికి ఖర్చు చేయాల్సిందిగా కోరారు. అనంతరం దాత కుటుంబానికి ఆలయ మర్యాదలతో స్వామి, అమ్మవార్ల దర్శనం చేయించారు.

పేదింట వికసించిన విద్యా కుసుమం



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా బుచ్చినాయుడు కండ్రిగ మండలానికి చెందిన సీనియర్ పాత్రికేయులు ప్రజాశక్తి రిపోర్టర్ బొర్రా వేణు కుమార్తె, బొర్రా హారిక బిఎస్సీ నర్సింగ్ ఫైనల్ ఇయర్ డిస్టింక్షన్‌లో పాసయ్యింది. హారిక తిరుపతి లోని బాలాజీ నర్సింగ్ కాలేజీలో చదువుతూ మొదటి నుండి కూడా జిల్లా లెవల్లో పాస్ అవుతూ చివరి సంవత్సరం కూడా డిస్టింక్షన్ రావడంతో అందరూ హారికను అభినందించారు. హారిక మొదటి నుండి గవర్నమెంట్ స్కూల్లో చదువుతూ గవర్నమెంట్ హాస్టల్లోనే ఉంటూ కష్టపడి చదివి తల్లిదండ్రులకు, గురువులకు మంచి పేరు తెచ్చిందని గురువులు సంతోషం వ్యక్తం చేశారు.

భక్తి, శ్రద్ధలతో రొట్టెల పండుగ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక జులేషా ఫిర్ దర్గాలో మంగళవారం భక్తిశ్రద్ధలతో రొట్టెల పండగను నిర్వహించారు. ముందుగా ఇమామ్ హుస్సేన్ పీర్ల జండాకు ప్రత్యేక పూజ చేసి అనంతరం రొట్టెల పండగను ప్రారంభించారు. చదువు, ఉద్యోగం, ఆరోగ్యం ప్రసాదించాలంటూ ప్రార్థించారు.

పాల ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

ఇద్దరు మృతి.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలు



ప్రజాశక్తి - రామచంద్రాపురం (చంద్రగిరి) తిరుపతి జిల్లా, చంద్రగిరి మండలం, తొండవాడ సమీపంలోని పూతలపట్టు- నాయుడుపేట జాతీయ రహదారిపై పాల ట్యాంకర్‌ను, కారు ఢీ కొట్టిన ఘటనలో ఇద్దరు మృతి చెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. చంద్రగిరి ఇంచార్జ్ సీఐ ఇమ్రాన్ ఇచ్చిన వివరాల మేరకు, విజయవాడ, చిట్టి నగర్, పెనుబాక వారి వీధికి చెందిన గర్రె కోటేశ్వరరావు కుటుంబ సభ్యులతో పాటు, అక్క హేమలతలు తిరుమల దైవ దర్శనానికి వచ్చి శ్రీవారిని దర్శించుకుని అనంతరం అరుణాచలానికి దైవ దర్శనానికి వెళ్లి దర్శనం చేసుకుని తిరిగి విజయవాడకు వెళుతుండగా మంగళవారం సాయంత్రం తొండవాడ బైపాస్ రోడ్‌లోని శ్లోక స్కూల్‌కి ఎదురుగా ముందు వెళుతున్న పాల ట్యాంకర్‌ను వారి కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో గర్రె పద్మావతి(38), జస్వంత్ సాయి(21)లు మృతి చెందారు. కారును డ్రైవింగ్ చేస్తున్న గర్రె కోటేశ్వరరావు ఎయిర్‌బెలూన్ తెరుచుకోవడం వల్ల ప్రమాదం నుంచి బయటపడ్డారు. కోటేశ్వరరావు భార్య పద్మావతి(38) అక్కడికక్కడే మృతి చెందింది. కుమారుడు జస్వంత్ సాయి తీవ్ర గాయాలు 108 వాహనంలో తిరుపతికి రుయాకు తరలించారు. వైద్య పరీక్షలు చేసిన వైద్యులు జస్వంత్ సాయి(21) మృతి చెందినట్లు నిర్ధారించారు. అక్క హేమలత, తమ్ముడు కోటేశ్వరరావులు తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నారు. హేమలత ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ఘటనపై చంద్రగిరి సీఐ ఇమ్రాన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. క్షతగాత్రులను హాస్పిటల్‌కు తరలించేందుకు స్థానికులుఅంబులెన్సులకు ఫోన్ చేశారు. కానీ అంబులెన్సులు సకాలానికి రాకపోవడంతో క్షతగాత్రులు కొన ఊపిరితో 45 నిమిషాల పాటు కొట్టుకున్నారు. నేషనల్ హైవే, 108 అంబులెన్స్ సకాలంలో వచ్చి ఉంటే ఇద్దరు ప్రాణాలు దక్కేవని స్థానికులు తెలిపారు.

సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి -ఏర్పేడు : ఏర్పేడు ఎంపీపీ వంగ గీత, వైసిపి నాయకుడితో తలెత్తిన వివాదం కారణంగా రాజీనామా చేశారు. గత మూడు మాసాలుగా ఈ రాజీనామా ఆమోదం పొందలేదు. ఉపాధ్యక్షులు జమ్మల శ్రీనివాసులు యాదవ్ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో సౌభాగ్యం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. తహశీల్దార్ భార్గవి పర్యవేక్షణలో సభ్యులు పలు సమస్యలు సభ దృష్టికి తీసుకువచ్చారు.

కైలాసకోన అర్చకులు శివైక్యం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : నారాయణవనం మండలం, అరణ్య కండ్రిగ పంచాయతీ, కైలాసకోన ఆలయ అర్చకులు సురేష్ స్వామి సోమవారం రాత్రి శివైక్యం చెందారు. ఆయన మృతిపట్ల పుత్తూరు గాయత్రి బ్రాహ్మణ సంఘం సెక్రటరీ విజయ్ కుమార్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

మహారాజశ్రీ 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జివారి కోర్టు :: తిరుపతి

I.A.No.216/2021
O.S.No. 562/2016

యం. మంగమ్మ ...వాది
యన్. అమ్మణమ్మ మరియు ఇద్దరు ...ప్రతివాదులు

3వ ప్రతివాదికి నోటీసు

To
R3-N. Yuvaraju, S/o. N. Radaiah, Krishna puram Village, Renigunta Mandal, Tirupati Dist.,

పై దావా నందు మీ యొక్క హాజరుకు గాను, 17-07-2025 వ తేదీన వాయిదా వున్నది, ఆ దినం ఉదయం. 10:30 గం॥లకు మీరుగాని, మీతరపున వకీలు గాని పై కోర్టులో హాజరై మీ యొక్క ఆక్షేపలు తెలుపుకొనవలెను లేనిచో కేసు మీ పరోక్షమున తీర్మాణించబడును.

RAYAPANENI GAJENDRA, B.Com., B.L.,
D.No. 19-3-1/C4, 3rd Cross (Left) Postal Colony, Renigunta Road, Tirupati.
Cell: 9490276001
P.SUJATHA,
D.V.L. DILLIBABU
Advocates Tirupati

మహా రాజశ్రీ శ్రీకాళహస్తి అదనపు జూనియర్ సివిల్ జడ్జి (జూనియర్ డివిజన్) వారి కోర్టులో

O.S.No. **339/2024**

కందాటి భక్తవత్సల రెడ్డి, తండ్రి కె.నారాయణరెడ్డి, డోర్ నెం. 16-266, రెడ్డి బిల్డింగ్, పి.యన్. రోడ్, పానగల్, శ్రీకాళహస్తి టౌన్, తిరుపతి జిల్లా ...వాది

వర్సెస్

వద్ది రఘురాం, తండ్రి వి.చలపతి నాయుడు, డోర్ నెం. 15-33/1, బి.పి.అగ్రహారం, శ్రీకాళహస్తి టౌన్, తిరుపతి జిల్లా ... ప్రతివాది

ప్రతివాదికి దావా సమన్లు

సదరు ప్రతివాదికి దావా సమన్లు కోర్టు ద్వారాను మరియు పోస్టు ద్వారాను పంపియు జారీకానందున, సబ్‌స్టిట్యూటెడ్ సర్వీసు కొరకు 31.07.2025 తేదీకి వాయిదా వేసి యున్నారు. కావున సదరు ప్రతివాది సదరు తారీఖున పైన తెలిపిన కోర్టులో హాజరై ఆక్షేపణలేమైనా వున్నచో ప్రత్యక్షముగా గానీ, లేదా వకీలు ద్వారా గానీ తెలుపుకోవలసినది, లేనిచో దావా నీ పరోక్షమున తీర్మానించబడునని తెలిజేయడమైనది.

ఇట్లు
కొప్పల సుబ్రమణ్యం, B.A., B.L.,
వాది తరపు న్యాయవాది, శ్రీకాళహస్తి.

IN THE COURT OF THE SENIOR CIVIL JUDGE: GUDUR
I.P.NO. 14 / 2025

Vallamkonda Venkateswarlu - Petitioner (Creditor)
Versus
1. Devaki Badri Venkata Narayana Gupta (Debtor)
2. Devaki Srinivasa Rao (Purchaser) - Respondents

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా 1వ రెస్పాండెంట్‌ను ఇన్‌సాల్వెంట్‌గా డిక్లేర్ చేయమని మరియు 1వ రెస్పాండెంట్ 2వ రెస్పాండెంట్ పేరిటికి రిజిష్టర్ చేసిన ఈక్రింది ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్థి యొక్క రిజిష్టర్డు శెటిల్‌మెంట్ పత్రం తే18-01-2025ది **డాక్యుమెంటు నెం.251/2025** (ఎస్ఆర్ఓ గూడూరు) రును రద్దు పరచమని కోరుతూ పై పిటిషనరు పై తెలిపిన కోర్టులో **ఐ.పి.నెం.14/2025** ను దాఖలు చేసియున్నందున సదరు పిటిషన్‌పై ఎవ్వరికైనను ఆక్షేపణలు ఉన్నయెడల **తే18-07-2025ది** న **ఉదయం 10.30 గంటలకు** మీరు స్వయంగా గానీ, వకీలు ద్వారా గానీ పై తెలిపిన కోర్టులో హాజరై ఆక్షే పణలు తెలుపుకోవలసినదిగా తెలియజేయడమైనది.

SCHEDULE

Item No.1: Tirupati District, Gudur District Registration, Gudur Sub Registration, Gudur Mandal, Gudur Municipality, East Gudur, Narayanamma Street, the house property bearing old assessment No.3949, New Assessment No.1029000201, ward no.8, D.No.138, an extent of 15 ½ ankanams equalent to 124 sq. yards and the RCC roofed house (Ground, 1 st floor and 2 nd floor) constructed there in **bounded by: East :** Municipal road some extent and wall of Item No.2 rooms some extent; **South :** house wall of Somisetty Venkateswarlu some extent and wall of Item No.2: rooms some extent; **West :** Municipal road some extent, Site belongs to Grandhi Vamsi Krishna some extent; **North :** Site belongs to Grandhi Suresh, Grandhi Vamsi Krishna some extent, shop room belongs to Potti Sumati some extent, With all its easementary rights.

Market value Rs.6,50,000/-

Item No.2: Tirupati District, Gudur District Registration, Gudur Sub Registration, Gudur Mandal, Gudur Municipality, East Gudur, Narayanamma Street, the house property bearing Assessment No.1029000201, in Sy.No.577/4, ward no.8, D.No.138, an extent of 4 ½ ankanams equalent to 36 sq. yards and the RCC roofed rooms (Ground, 1 st floor) constructed there in **bounded by: East :** Municipal road; **South :** house wall of Somisetty Venkateswarlu;**West :** Item No.1 house; **North :** Item No.1 house; With all its easementary rights

Market value Rs.2,50,000/-

ఎం.లింగమూర్తి, M.B.A., L.L.M.,
బి.బాలప్రదీప్, M.B.A., L.L.M.,
పిటిషనరు తరపు అడ్వకేట్స్, గూడూరు.

క్రైం న్యూస్

కుక్కల దాడిలో దుప్పి మృతి



ప్రజాశక్తి - రామచంద్రపురం: మండలంలోని నిలువురాళ్ల కమ్మపల్లిలో కుక్కల దాడిలో అడవి జంతువు దుప్పి మృతి చెందింది. మంగళవారం ఎన్ ఆర్ కమ్మపల్లి, అటవీ ప్రాంతం నుంచి దుప్పి ఒంటరిగా గ్రామ సమీపానికి వచ్చింది. ఇది గమనించిన గ్రామంలోని కుక్కలు దుప్పిని వెంటాడాయి. అలసిపోయిన దుప్పి కింద పడిపోవడంతో కుక్కలు దాడి చేసి చంపేశాయి. ఈ విషయాన్ని గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటువీశాఖ అధికారులు సంఘటనా స్థలాని చేరుకుని దుప్పి మృత దేహన్ని స్వాధీనం చేసుకుని, పశు వైద్య శాఖ అధికారిణి డాక్టర్ భువనేశ్వరి ఆధ్వర్యంలో పోస్టుమార్టం నిర్వహించి ఖననం చేయించారు.

దాడి కేసులో తొమ్మిదిమంది అరెస్టు



చికిత్స పొందుతున్న క్షతగాత్రులు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : ఏరియా ఆసుపత్రి ఘటనలో తొమ్మిది మంది నిందితులను మంగళవారం టూ టౌన్ పోలీసులు అరెస్టు చేశారు. ఆదివారం అర్ధ రాత్రి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మంచినీళ్ల గుంటకు చెందిన యువకులపై వారి బంధువులపై వీఎంపల్లికి చెందిన కొందరు యువకులు దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై విచారణ చేపట్టిన పోలీసులు దాడిలో పాలుపంచుకున్న తొమ్మిదిమంది నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. కాగా వీఎంపల్లి యువకుల దాడిలో గాయపడిన ఐదుగురు మంచినీళ్ళగుంటవాసులు ప్రస్తుతం పట్టణంలోని ఓ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని బంధువులు తెలిపారు.

తండ్రిపై కొడుకు కత్తితో దాడి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తండ్రి పై కొడుకు కత్తితో దాడి చేసిన ఘటన సోమవారం అర్ధరాత్రి డిబిఆర్ హాస్పిటల్ సమీపంలో చోటు చేసుకుంది. ఈస్ట్ పోలీసులు కథనం మేరకు ఐరాల మండలం, గురవారంపల్లెకు చెందిన బాబు తిరుపతిలో సెక్యూరిటీగా విధులు నిర్వహిస్తున్నారు. కుటుంబ తగాదాలతో అతని కుమారుడు సంతోష్ సోమవారం అర్ధరాత్రి కత్తితో దాడి చేశాడు. కుటుంబ సభ్యులు అప్రమత్తం కావడంతో ప్రమాదం తప్పింది. తీవ్ర గాయాలు పాలైన బాబుని, కుటుంబ సభ్యులు రుయా ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఈస్ట్ పోలీసులు, బాధితుడు వద్ద స్టేట్మెంట్ తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్కూటర్ బోల్తా.. వ్యక్తి మృతి

ప్రజాశక్తి - రామచంద్రాపురం : మండలంలోని గంగిరెడ్డిపల్లి, తోకగుట్ట మలుపు వద్ద స్కూటర్ అదుపుతప్పి బోల్తా పడిన ప్రమాదంలో సుబ్రహ్మణ్యం ఆచారి (50) మృతి చెందాడు. ఆర్‌సి పురం పోలీసుల సమాచారం మేరకు చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలం, పచ్చికాపల్లం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం ఆచ్చారి (50) తమ స్వగ్రామం నుంచి తిరుపతికి పనుల నిమిత్తం ద్విచక్ర వాహనంలో వెళుతూ గంగిరెడ్డి పల్లి తోక గుట్ట మలుపు వద్ద అదుపు తప్పి రోడ్డు మలుపు పక్కన నాటిన రక్షణ రాయిపై పడి, తలకు తీవ్ర గాయమై స్పృహ కోల్పోయాడు. రోడ్డుపై వెళ్తున్నవారు పోలీసులకు తెలిపారు. ఆర్సీపురం పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రుడుని తిరుపతి రూయా ఆస్పత్రికి తరలించగా, మార్గమధ్యంలో ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు నిర్ధరించారు.



మృతి చెందిన సుబ్రహ్మణ్యం ఆచారి

IN THE COURT OF PRINCIPAL SENIOR CIVIL JUDGE : TIRUPATI
I.A.NO. 113/2024, I.A.NO. 290/2017
O.S.NO. 495/2009

P. Valliamma ....Petitioner/Pliantiff
Vs
N. Ramakrishnaiah, S/o Late N. Venkatamuni Chetty (died) and others .... Respondents

NOTICE TO THE RESPONDENT No. 5 to 8

R5. N. Munikrishna, S/o Late N. Ramakrishnaiah , Guruvarajupalli.
R6. Vijayalakshmi, D/o Late N. Ramakrishnaiah, Guruvarajupalli.
R7. Jyothi, D/o Late N. Ramakrishnaiah, Guruvarajupalli.
R8.Neeraja@Yasoda, D/o Late N. Ramakrishnaiah
(Respondents No. 5 to 8 are the proposal L'Rs of 1 Respondent / Defendant Late N. Ramakrishnaiah)

Sir / Madam

Please take I.A notice in IA No. 290/2017 in place of yours father deceased N. Ramakrishnaiah, who died on 22-10-2023 you No. 5 to 8 Respondents being brought up on record as a proper necessary parties to the suit filed by the petitioner / plaintiff. The case is posted to 10.07.2025 for your appearance before the court through person or by engaging an advocate, if you No. 5 to 8 respondents fail to appear before the court the matter will be decided on your expàrty.

By order of the Court
S. Niranjan Babuji , B.Com, LLB.,
Advocate for petitioner/plaintiff.

మహారాజశ్రీ గూడూరు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జివారి కోర్ట్ లో

I.A.No. 324/2025
O.S.No. /2025

Lokku Renuka ...పిటిషనరు/వాది
Vs
1. Alimili Veera Raghavaiah
2. Kokolu Mahesh ...రెస్పాండెంటు/ప్రతివాదులు

జనరల్ నోటీసు

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా పై నెంబరులో 1వ రెస్పాండెంట్ తనకు ఉన్న బాకీలను తీర్చకుండా దావా షెడ్యూలు ఆస్తిని బాకీ దార్లకు చెందకుండా చేయాలనే ఉద్దేశ్యముతో 2వ రెస్పాండెంటుతో కుమ్మకై అమ్మివేసినారు. కావున 1వ రెస్పాండెంట్ తేది 18.11.2024న 2వ రెస్పాండెంట్‌కు వ్రాసి యిచ్చిన విక్రయ పత్రం రద్దు కోరుచూ పై నెంబరు దావా దాఖలు చేసినందున ఇంకను ఎవరికైనా ఎలాంటి ఆక్షేపణలు ఉన్న యెడల తేది 24.07.2025న పై కోర్టు ఎదుట ఉదయం10:30 గం॥లకు హాజరై తెలుపుకొవలసినది. లేని యెడల ఆక్షేపణలు లేనట్లుగా తీర్మానం చేయుదురని తెలియజేయడమైనది.

షెడ్యూలు
SCHEDULE

Item No. 1. Tirupati Registration Dist. – Gudur Sub-registration Dist. – Gudur Mandal – Kommaneturu panchayat -- Kommaneturu village – Sy. No. 178-6 – L.P. No. 2697 – Ac. 2-28 – Dry Land East: Land of Kokolu Mahesh South: Outskirts of Tiruvengalayapalli village West: Land of Bommidi Krishna Mohan to some extent and Vedicherla Chenchala Rao to some extent North: Varava Kaluva to some extent and Joint way to some extent Item **No. 2** Tirupati Registration Dist. – Gudur Sub-registration Dist. – Gudur Mandal – Kommaneturu panchayat -- Kommaneturu village – Sy. No. 178-7 – L.P. No. 1888 – Ac. 0-84 – Dry Land East: Land of Chutti Krishnaiah South: Land of Chutti Leela Mohan West: Land of Kokolu Mahesh North: Varava Kaluva

యరగుడిపాటి అరవింద్, M.B.A., LL.B.,
పిటిషనర్ తరపు న్యాయవాది,
గూడూరు, తిరుపతి జిల్లా
Cell: 98493 08789

ప్రకృతి వ్యవసాయం చేద్దాం



రైతులకు సూచనలిస్తున్న ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్తలు

ప్రజాశక్తి -ఏర్పేడు : మద్రాసు ఫెర్టిలైజర్, కృషి విజ్ఞాన కేంద్రము, రాస్ మహిళా భారతి సంయుక్త ఆధ్వర్యంలో పాపా నాయుడు పేట రాస్ సేవా నిలయంలో మంగళవారం రైతు సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో నేల ఆరోగ్య పరీక్ష, సేంద్రియ సాగు, సేంద్రియ ఉత్పత్తులపై అవగాహన కల్పించారు. కృషి విజ్ఞాన కేంద్రం రాస్, సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ భూమిలో పూర్తిగా సేంద్రియ కార్బన్ శాతము తగ్గిపోయిందని తద్వారా దిగుబడులు తగ్గి పీడపీడలు పెరుగుతున్నాయన్నారు. ప్రతి రైతు కొంత విస్తీర్ణంలో అయినా సేంద్రియ సాగు చేసి తద్వారా నాణ్యమైన పంటలు పండించాలి అన్నారు. శ్రీకాళహస్తి, వ్యవసాయ సంచాలకులు రమేష్ రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ శాఖ తరఫున అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ ఈక్రాప్ పంటల బీమా, వ్యవసాయ యాంత్రీకరణ గురించి తెలియజేశారు. జిల్లా పథకం మేనేజర్(పీఎం సీఎస్ ఎఫ్) షణ్ముగం మాట్లాడుతూ భూసారాన్ని పెంచడానికి ప్రతి రైతు కూడా పీఎండీఎస్ విత్తనాలు విత్తుకోవాలన్నారు. చీఫ్ మేనేజర్ (మద్రాస్ ఫర్టిలైజర్ లిమిటెడ్) అనినారాయణ స్వామి మాట్లాడుతూ సేంద్రియ ఉత్పత్తుల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎస్ శ్రీనివాసులు రావు, సీనియర్ శాస్త్రవేత్త రాస్ కెవికె రమేష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంపై దృష్టి పెట్టండి



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: గ్రామాల్లో పారిశుధ్యం పనులపై దృష్టి పెట్టాలని, అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎంపీడీవో వెంకటరత్నమ్మ సూచించారు. మండలంలోని తలారి పెట్టు, కల్లివెట్టు గ్రామాల్లో మంగళవారం ఆమె పారిశుధ్య పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో చెత్తను తొలగించాలని, తడి, పొడి చెత్తను వేరు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు, ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ఓం సాయిరాం చారిటీస్ వారు మంగళవారం అరుణ్ జైన్ పుట్టినరోజు సందర్భంగా వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ అరుణ్ జైన్ జన్మదినాన్ని ఆశ్రమంలో వృద్ధులు మధ్య జరుపుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సుమిత్ర, ప్రగతి సేవా సంస్థ ట్రెజరీ కాటూరి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మొబైల్ బుక్ కీపింగ్ 2.0 తో పారదర్శకత




ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, వెలుగు కార్యాలయంలో ఏపియం, సీసీలు, విఓఏలు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ విజయవాడ నుంచి మొబైల్ బుక్ కీపింగ్ 2.0 పై జూమ్ మీటింగ్ ద్వారా శిక్షణ కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ సీఈఓ శ్రీరాములు నాయుడు మాట్లాడుతూ మార్చి 31 తేదీ 2025 నాటికి సంఘంలో సభ్యురాలు వారీగా పొదుపులు తో పాటు అంతర్గత అప్పులు, సిఐఎఫ్, బ్యాంక్ లోన్, స్త్రీ నిధి, ఉన్నతి, ఇతర రుణాలు నిల్వలు ఖచ్చితంగా సేకరించి ఏప్రిల్ నుండి నెల వారీగా లావాదేవీలు నమోదు చేయాలని సూచించారు. నమోదులో 100 శాతం పారదర్శకత ఉండాలన్నారు. పెండింగ్‌లో ఉన్న నమోదులు పూర్తి చేయాలని, రికవరీలు పూర్తి చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో వెంకటరత్నం, వీరజిన్నప్ప, పయని, జీవ, విఓఏ లు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజాశక్తి - నాగలాపురం: రైతుల సంక్షేమమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. మంగళవారం ఒక్క రోజే రాష్ట్రంలో 25 వేల ఎకరాలు రైతుల భూమిలో ఉచితంగా మొక్కలు నాటే ప్రక్రియను ఉపాధి హామీ పథకం ద్వారా ప్రభుత్వం చేపడుతుందన్నారు. అందులో భాగంగా నాగలాపురం మండలం, కొట్టకాడు గ్రామ రైతు పొలంలో పూల మొక్కలు నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం ద్వారా పండ్ల, పూల మొక్కలు పెంపకం ప్రభుత్వం ఉచితంగా చేపడుతుందన్నారు. రైతులకు ప్రభుత్వం డబ్బులు చెల్లిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, రైతులు పాల్గొన్నారు.

కూటమితోనే అభివృద్ధి, సంక్షేమం



ప్రజాశక్తి - గూడూరు టౌన్ :గూడూరు మండల పరిధిలోని రామలింగాపురం, సంత దాసు పల్లి గ్రామాల్లో మంగళవారం గూడూరు ఎమ్మెల్యే పాశం సునీల్ కుమార్ సూపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఇంటింటికి తిరిగి ప్రభుత్వ చేసిన అభివృద్ధి , సంక్షేమకార్యక్రమాలను వివరించారు. రామలింగాపురంలో ఉపాధి హామీ పథకం నిధులతో 6 లక్షల రూపాయలతో నిర్మించిన సి.సి రోడ్‌ను, 9 లక్షల రూపాయలతో నిర్మించిన స్కూల్ ప్రహరీ గోడను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మామిడి మొక్కలు నాటిన ఎంపీడీవో



ప్రజాశక్తి - వాకాడు: తిరుపతి జిల్లా, వాకాడుమండల పరిధిలోని జమీన్ కొత్తపాలెంలో మంగళవారం, మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం (హార్టికల్చర్) ద్వారా నాలుగు ఎకరాలలో మామిడి మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసులు, జమీన్ కొత్తపాలెం మాజీ సర్పంచ్, ఎంపీటీసీ, గూడూరు నియోజకవర్గ బిజెపి కన్వీనర్ పాపా రెడ్డి పురుషోత్తమ రెడ్డి, ఏపీవో విజయమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ పురోగతి వివరాలను
పారదర్శకంగా సేకరించాలి



ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: పంచాయతీ పురోగతి వివరాలను పారదర్శకంగా సేకరించి ఆన్లైన్లో నమోదు చేయాలని బుచ్చినాయుడు కండ్రిగ ఎంపీడీవో వెంకటరత్నమ్మ కోరారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయితీ అడ్వాన్స్ మెంట్ ఇండికేటర్ సర్వేపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంఈఓ ముని సుబ్రణ్యం, రవీంద్రనాథ్, వైద్యాధికారి మురళీధర్ రెడ్డి తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ వివరాల సేకరణ పూర్తిచేసి, గ్రామసభ నిర్వహించి ఆమోదం తీసుకోవాలన్నారు. ఎంఈఓ ముని సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ పంచాయతీ పురోగతిపై నిర్వహించే సర్వే వల్ల నిర్దిష్ట రంగాల్లో బలహీనతలను గుర్తించడానికి వీలు పడుతుందన్నారు. అనంతరం సర్వే విధానాన్ని రిసోర్స్ పర్సన్ హేమంత్ కుమార్ వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం, పంచాయతీ సెక్రటరీలు, డిజిటల్ అసిస్టెంట్లు,ఏఎన్ఎంలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

స్ప్రీ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: రాయలసీమ ప్రాంత యజమానులు స్ప్రీ పథకాన్ని గరిష్టంగా సద్వినియోగం చేసుకోవాలని ఇ.ఎస్.ఐ. కార్పొరేషన్ రాయలసీమ ప్రాంతీయ జాయింట్ డైరెక్టర్ డి.రాధాకృష్ణ విజ్ఞప్తి చేశారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హిమాచల్ ప్రదేశ్, సిమ్లాలో కేంద్ర కార్మిక, ఉపాధి కల్పన, యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రి డాక్టర్ మన్సుక్ మాండవీయ అధ్యక్షతన జరిగిన ఈఎస్ఐ కార్పొరేషన్ 196వ సమావేశంలో స్ప్రీ 2025 (ఉద్యోగులు, యాజమాన్యాల నమోదును ప్రోత్సహించే పథకం)ను కార్మిక రాజ్య బీమా సంస్థ (ఈఎస్ఐసీ) ఆమోదించిందని తెలిపారు. ఈఎస్ఐ చట్టం ప్రకారం సామాజిక భద్రతా కవరేజీని విస్తరించడమే ఈఎస్ఐసీ ఆమోదించిన స్కీమ్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ రిజిస్ట్రేషన్ ఆఫ్ ఎంప్లాయర్స్ అండ్ ఎంప్లాయిస్ (స్ప్రీ) 2025 లక్ష్యమన్నారు. ఈ పథకం 2025 జులై 1 నుంచి డిసెంబర్ 31 వరకు అమలులో ఉంటుందని తెలిపారు. ఇప్పటి వరకు నమోదు చేసుకోని యాజమాన్యాలు, ఒప్పంద, తాత్కాలికంగా పనిచేస్తున్న వారితో సహా ఉద్యోగులందరూ ఎలాంటి తనిఖీలు లేదా పాత బకాయిలతో సంబంధం లేకుండా రిజిస్ట్రేషన్ చేసుకునే అవకాశాన్ని ఈ పథకం కల్పిస్తుంది.

స్ప్రీ 2025లో చేపట్టే కార్యక్రమాలు

తమ సంస్థలు, ఉద్యోగులను ఈఎస్ఐసీ పోర్టల్, శ్రామ్ సువిధ, ఎంసీఏ పోర్టల్ ద్వారా డిజిటల్ గా నమోదు చేసుకోవచ్చు. యజమాని ప్రకటించిన తేదీ నుంచి రిజిస్ట్రేషన్ చెల్లుబాటును పరిగణనలోకి తీసుకుంటారు. రిజిస్ట్రేషన్ ముందు కాలానికి ఎలాంటి చందా, ప్రయోజనం వర్తించదు. రిజిస్ట్రేషన్ ముందు కాలానికి సంబంధించిన రికార్డుల తనిఖీలు నిర్వహించరు. పాత రికార్డుల గురించి అడగరు. జరిమానాల భయాన్ని తొలగించి, రిజిస్ట్రేషన్ల ప్రక్రియను సులభతరం చేయడం ద్వారా స్వచ్ఛందంగా నమోదు చేసుకొనేలా ఈ పథకం ప్రోత్సహిస్తుంది. స్ప్రీ పథకం ప్రారంభించడానికి ముందు నిర్దిష్ట కాలవ్యవధిలో నమోదు చేసుకోకపోతే.. చట్ట పరమైన చర్యలు ఎదుర్కోవాల్సి వచ్చేది. లేదా పాత బకాయిలు చెల్లించాల్సి వచ్చేది. ఈ అడ్డంకులను తొలగించి... నమోదు కాని ఇతర సంస్థలు, కార్మికులను సైతం ఈఎస్ఐ పరిధిలోకి తీసుకువచ్చి, సమగ్ర సామాజిక భద్రతను అందించడమే స్ప్రీ 2025 లక్ష్యం. స్ప్రీ 2025 ప్రారంభంతో సమ్మిళితమైన, సామాజిక భద్రతను అందించే పురోగమన సమాజం దిశగా కార్మిక రాజ్య బీమా సంస్థ ముందడుగు వేసింది. రిజిస్ట్రేషన్ ప్రక్రియను సరళతరం చేసి పాత బకాయిల నుంచి మినహాయింపు ఇవ్వడం ద్వారా తమ శ్రామిక శక్తిని క్రమబద్ధీకరించుకొనేలా యాజమాన్యాలను ప్రోత్సహిస్తుంది. అలాగే మరింత మంది కార్మికులను ముఖ్యంగా కాంట్రాక్టు రంగాల్లో పని చేసేవారు ఈఎస్ఐ చట్టం ద్వారా అవసరమైన ఆరోగ్య, సామాజిక ప్రయోజనాలను పొందేలా చేస్తుంది. భారత్‌లో సంక్షేమ కేంద్రక కార్మిక వ్యవస్థ దార్శనికతకు అనుగుణంగా దాని పరిధిని బలోపేతం చేసుకోవడానికి, సార్వత్రిక సామాజిక భద్రత అనే లక్ష్యాన్ని నెరవేర్చడానికి ఈఎస్ఐసీ కట్టుబడి ఉందన్నారు. దీన్ని రాయలసీమ వాసులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నల్లపురెడ్డి వ్యాఖ్యలు క్షమించరానివి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి :కోవూరు నియోజకవర్గ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి పై వైసీపీ మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలు క్షమించరానివని శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి బొజ్జల రిషితా రెడ్డిలు మంగళవారం రెండు వేరువేరు ప్రకటనలలో ఖండించారు. వైసీపీ నేతలకు మహిళలంటే గౌరవం లేకుండా పోయిందని మండిపడ్డారు. మహిళలపై మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేయకుండా ప్రసన్నకుమార్ రెడ్డిపై గట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారి వెంట టిడిపి రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, డాక్టర్ ఉమేష్ రావు, మిన్నల్ రవి, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

నూతన ఆవాజ్ కమిటీ ఎంపిక



ప్రజాశక్తి - నాయుడుపేట: నాయుడు పేట మండలం నూతన ఆవాజ్ కమిటీ ఎన్నిక జూలై 7వ తేదీ సోమవారం రాత్రి కామ్రేడ్ వేదనపర్తి సుందర్ రామిరెడ్డి భవనంలో ఆవాజ్ మైనారిటీ డెవలప్మెంట్ ఫోరం జనరల్ బాడీ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షులు షేక్ రషీద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆవాజ్ 22 నుంచి మైనారిటీల అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. దేశంలో ఉన్న మతతత్వ ప్రభుత్వాన్ని ఎదిరించేందుకు లౌకిక శక్తులతో చేతులు కలుపుకొని ఆవాజ్ పోరాడుతుందన్నారు. గత 11 సంవత్సరాల నుంచి దేశంలో కట్టుకునే బట్ట మీద, తినే తిండి, విద్య అనేది చూడకుండా ప్రతి విషయంలో కూడా మైనార్టీలపై దాడిని కొనసాగిస్తుందన్నారు. రాష్ట్రంలో కూడా బిజెపి విధానాలనే అవలంబించే మైనారిటీలను దెబ్బతీస్తున్నారు. గత ఐదు సంవత్సరాలు మైనారిటీ లోన్లు ఇవ్వకపోగా ఇప్పుడు ఇచ్చి ఉన్న మైనారిటీ లోన్లు సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. దులహన్ స్కీము అమలు చేయడం లేదన్నారు. కొన్ని సాధించేందుకు నాయుడుపేట కమిటీ కూడా రాబోయే రోజుల్లో కార్యచరణ రూపొందించుకోవాలని తెలియజేశారు.ఏడు మంది తో నూతన కమిటీ అధ్యక్షులు పి.హలీం ఖాన్,కార్యదర్శి షేక్.ఖాదర్,ఉపాధ్యక్షులు షేక్ అన్సర్,ఉపాధ్యక్షులు షేక్.ఉస్మాన్,సహాయ కార్యదర్శిలు షేక్.కాలేషా,షేక్.అబ్దుల్లా,ట్రెజరర్ గా షేక్.రిలిజ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయండి

సిపిఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ



ప్రజాశక్తి - తిరుపతి సిటీ: ప్రజా సంఘాలు, వామపక్షపార్టీల ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిపిఐ నారాయణ పిలుపునిచ్చారు. తిరుపతి గంధమనేని శివయ్య భవనంలో మంగళవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా బిజెపి ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలు అవలంభిస్తూ కార్పొరేట్లకు మేలు చేస్తూ పేద, మధ్య తరగతి ప్రజలను మభ్యపెడుతున్న వైనాన్ని సమ్మె ధ్వార ఎండగట్టి ప్రజల్లో చైతన్యం తీసుకొస్తామన్నారు. వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టినట్లు ఆయన పేర్కొన్నారు. బిజెపి తోకపట్టుకొని రాష్ట్రంలో టీడీపీ, జనసేన తానాతందానా అంటూ ప్రజల అభిలాషలను, ఆకాంక్షలను పక్కన బెట్టి అవినీతి, అక్రమాలు, దోపిడీలను కొనసాగిస్తోందన్నారు. జగన్ ఆలస్యంగానైనా మామిడి రైతుల గోడు వినేందుకు వస్తుండడం బాగానే ఉన్నా, అక్కడ మందిమార్భలంతో హంగామాలు చేయడం కన్నా రైతుల గోడు విని, ప్రభుత్వాన్ని నిలదీస్తే బాగుంటుందని సూచించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, శివారెడ్డి, జిల్లా కార్యదర్శి పి.మురళి, జిల్లా కార్యవర్గ సభ్యులు చిన్నం పెంచులయ్య, నగర కార్యదర్శి విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

టెక్నాలజీతో శ్రీవారి దర్శనం

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహకారం తీసుకోవాలి : టిటిడి ఈవో జె. శ్యామలరావు

ప్రజాశక్తి - తిరుపతి డెస్క్: తిరుమల శ్రీవేంకటేశ్వర స్వామి దర్శనార్థం విచ్చేసే భక్తులకు ఆధునిక టెక్నాలజీ సాయంతో నిర్దేశించిన సమయానికి దర్శనం అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు టిటిడి ఈవో జె. శ్యామల రావు సూచించారు. టిటిడి కార్యనిర్వాహనాధికారి సమావేశ మందిరంలో అదనపు ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరితో కలిసి మంగళవారం టిసిఎస్, ఏఐ ప్రతినిధులు, టిటిడి ఐటీ అధికారులతో వర్చువల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఈవో మాట్లాడుతూ, శ్రీవారి దర్శనానికి సర్వదర్శనం, సమయ నిర్దేశిత సర్వదర్శనం (ఎస్.ఎస్.డి), ప్రత్యేక ప్రవేశ దర్శనం (ఎస్.ఈ.డి), దివ్యదర్శనం తదితర మార్గాల ద్వారా తిరుమలకు భక్తులు వస్తుంటారని, సదరు భక్తులకు ఆధునిక సాంకేతికత, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ తదితర అడ్వాన్స్ టెక్నాలజీ సాయంతో సకాలంలో దర్శనం చేయించడంపై తగు చర్యలు తీసుకోవాలని వారిని కోరారు. భక్తులు శ్రీవారి దర్శనానికి క్యూలైన్లలో చేరినప్పటి నుండి దర్శనం అయ్యే వరకు టెక్నాలజీని ఉపయోగించి శ్రీవారి దర్శనం సులభతరం చేయించే అంశానికి సంబంధించి తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ అంశంపై నిర్దిష్ట నిర్ణయానికి వచ్చేందుకు టిసిఎస్ ప్రతినిధులు, ఏఐ ప్రతినిధులు టిటిడి ఐటీ విభాగం ప్రతినిధులు సమిష్టిగా తరచూ సమావేశాలు నిర్వహించి ప్రణాళికబద్ధంగా చర్యలు చేపట్టాలని కోరారు. టిటిడిలో ఇప్పటి వరకు టిటిడి సిబ్బందితో భక్తులను ధృవీకరించడం జరుగుతోందని, సాంకేతిక రంగంలో వేగంగా మారుతున్న మార్పులకు అనుగుణంగా క్యూఆర్ కోడ్, ముఖ గుర్తింపు పద్ధతి ద్వారా భక్తులను ధృవీకరించి మరింత సమయాన్ని ఆదా చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఈవో కోరారు. అదే విధంగా శ్రీవారి దర్శనానికి భక్తులకు కేటాయించిన సమయానికి రాకపోవడం మూలంగా మరింత ఆలస్యం అవుతోందని, భక్తులను నిర్దేశించిన సమయానికి వారికి కేటాయించిన ప్రాంతానికి వచ్చేలా భక్తులకు అవగాహన కల్పించాలని సూచించారు. తద్వారా మరింత సమయం ఆదా కావడమే కాక, భక్తులకు సంతృప్తికరమైన శ్రీవారి దర్శనం చేయించవచ్చని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ని ఉపయోగించాలని ఆయన అన్నారు. అంతకుముందు, భక్తులు క్యూలైన్లలో ప్రవేశించినప్పటి నుండి కంపార్మెంట్లలో ఎంత సేపు ఉంటున్నారు, క్యూలైన్లలో భక్తులు చేరినప్పటి నుండి శ్రీవారి దర్శనానికి ఎంత సమయం అవుతోంది, అనంతరం ఆలయం నుండి వెలుపలికి రావడానికి ఎంత సమయం పడుతోంది, సమయ నిర్దేశిత సర్వదర్శనం (ఎస్.ఎస్.డి), ప్రత్యేక ప్రవేశ దర్శనం (ఎస్.ఈ.డి), దివ్యదర్శనం, ఆర్జిత సేవలకు భక్తులు దర్శనం కోసం వేచియున్న సమయాన్ని పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా టిసిఎస్ ప్రతినిధులు వివరించారు. ఈ సమావేశంలో టిటిడి ఐటీ విభాగం జీఎం శ్రీ శేషా రెడ్డి, ఏజీఎం శ్రీ వేంకటేశ్వర చౌదరి తదితర అధికారులు పాల్గొన్నారు.

సాయిబాబాకు పట్టు వస్త్రాలు సమర్పణ



ప్రజాశక్తి - రామచంద్రపురం : మండలంలోని బొప్పరాజు పల్లి గ్రామంలో వెలసిన శ్రీ షిరిడిబాబా గురు పౌర్ణమి ఉత్సవాలలో భాగంగా పట్టు వస్త్రాలు సమర్పించారు. మంగళవారం మాజీ ఎంపీపీ డి బిందు మాధవి, జీడీ నెల్లూరు టిడిపి నాయకులు బట్టే చాణిక్య ప్రతాప్ లు ఉభయ దాతలైన బట్టి మారయ్య స్వగృహం నుండి మంగళ వాయిద్యాలు, భక్త భజనలు, సాయి నామ స్మరణ ఊరేగింపుగా పట్టు వస్త్రాలను ఆలయం వద్దకు తీసుకొచ్చారు. అనంతరం శ్రీ షిరిడి సాయిబాబా మూల విగ్రహానికి వివిధ రకాల అభిషేకాలు నిర్వహించి, పట్టు వస్త్రాలు, బంగారు ఆభరణాలు, వివిధ పుష్పాలతో విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురు పౌర్ణమి పౌర్ణమి సందర్భంగా గ్రామంలోని శ్రీ షిరిడి సాయిబాబాకు గురు పౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఆలయ కార్య నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, భక్తులు, విశేషంగా పాల్గొన్నారు. స్వామి వారి భక్తులకు కార్యనిర్వాహకులు అత్యంత ప్రసాదాలను అందజేశారు.

టొబాకో విక్రయాలపై దాడులు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : పట్టణంలోని దర్గా మిట్ట, బీపీ అగ్రహారం ప్రాంతాల్లో ఉన్న పలు చిల్లర కొట్టు దుకాణలపై మంగళవారం వన్ టౌన్ పోలీసులు దాడులు జరిపారు. టొబాకో ఉత్పత్తుల అమ్మకాలు చేస్తున్న పలువురిపై కోప్టా చట్టం కింద జరిమానా విధించారు. బీడీలు, సిగరెట్లు విక్రయిస్తే చర్యలు తప్పవని సీఐ గోపీ హెచ్చరించారు.

మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ



ప్రజాశక్తి - వాకాడు: మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఒక్కరోజు శిక్షణా కార్యక్రమానికి మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సహాయకులు, ఇంజనీరింగ్ సహాయకులు, ఏఎన్ఎంలు హాజరయ్యారు. పంచాయతీ అభివృద్ధి సూచిక వర్షన్ 2.0 శిక్షణా కార్యక్రమంలో వివిధ శాఖలకు సంబంధించిన అభివృద్ధి సూచికలను నమోదు చేసి కేంద్రం ఎంపిక చేసే అవార్డులకు పంపుటకు మండల స్థాయి శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగిందని మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి శ్రీనివాసులు, తాసిల్దార్ రామయ్య, సిడిపిఓ, డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

హృద్రోగ బాధితురాలికి ఆర్థిక సాయం



ప్రజాశక్తి - చిల్లకూరు : చిల్లకూరు మండలం, నెలబల్లి, రెట్టపల్లి అరుంధతివాడకు చెందిన కురుగొండ రేణుక (13) కొన్నేళ్లుగా గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. ఆమెకు వైద్య ఖర్చుల నిమిత్తం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు రాజనేని శ్రీనివాసులు నాయుడు దాతృత్వంతో 15 వేల రూపాయలను మంగళవారం ట్రస్ట్ సభ్యులు ప్రజేంద్రరెడ్డి, భాస్కర్‌లు రేణుక తల్లి సుజాతకు అందజేశారు.

ఘనంగా నడివీధి గంగమ్మ జాతర



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ జయశంకర్ కాలనీలో ఉన్న నడివీధి గంగమ్మ జాతరను మంగళవారం స్థానికులు ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి అంబళ్ల పోసి, పొంగళ్ళు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జగన్ పర్యటన కుట్ర పూరితమే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మాజీ ముఖ్యమంత్రి జగన్ చేస్తున్న బంగారుపాళ్యం పర్యటన శాంతిభద్రతలకు విఘాతాన్ని కలిగిస్తుందని తిరుపతి, చిత్తూరు జిల్లాల టిడిపి పార్లమెంటు డివిజన్ రైతు సంఘం అధ్యక్షులు గోపీనాథ్ రెడ్డి, నాగేశ్వరరావులు పేర్కొన్నారుజ మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తోతాపురి మామిడి రైతులను ప్రభుత్వం ఆదుకుందన్నారు. జగన్ పర్యటనను వ్యతిరేకిస్తున్నామని రైతు సంఘాల నాయకులు ప్రకటించారు. ఈ విలేకరుల సమావేశంలో కోటేశ్వర్ రెడ్డి, ప్రకాష్ నాయుడు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళలను కించపరచడం వైసిపికి పరిపాటే

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మహిళా ప్రజా ప్రతినిధులను కించపరుస్తూ మాట్లాడడం వైసీపీ నేతలకు పరిపాటిగా మారిందని టీడీపీ నాయకులు ఆరోపించారు. వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డికి, ప్రసన్న కుమార్ రెడ్డి బహిరంగ క్షమాపణ చెప్పి, ఆయన వ్యాఖ్యలను వెనక్కు తీసుకోవాలని తిరుపతి నగరపాలక సంస్థ డిప్యూటీ మేయర్ ఆర్సి మునికృష్ణ, నాయి బ్రాహ్మణ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ రుద్రకోటి సదాశివంలు డిమాండ్ చేశారు. మంగళవారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓటమి జీర్ణించుకోలేకే ప్రసన్న కుమార్ రెడ్డి అవహేళనగా మాట్లాడారన్నారు. అతడిని వైసీపీ నుండి సస్పెండ్ చేయాలని జగన్మోహన్ రెడ్డికి సూచించారు.

ఘనంగా వైఎస్సార్ జయంతి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతిని మంగళవారం నియోజకవర్గ వ్యాప్తంగా వైసీపీ నాయకులు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని వైఎస్సార్ విగ్రహానికి, వాంపల్లిలోని వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారీ కేకులు కట్ చేసి కార్యకర్తలకు పంచిపెట్టారు. పేదలకు అన్నదానం చేశారు. రాజశేఖర్ రెడ్డి తెలుగు ప్రజలకు చేసిన సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. మాజీ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు, మాజీ సింగిల్ విండో చైర్మన్ చెవిరెడ్డి మధుసూదన్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ వయ్యాల కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటి : తిరుపతి, మంగళం రూరల్స్ సెక్షన్‌లో మునిసిపల్ కార్పొరేషన్ అండర్ డ్రైనేజీ కి సంబంధించి విద్యుత్ లైన్లు మరమ్మత్తులు కారణంగా విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నట్లు ఈఈ చంద్రశేఖర రావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 9వ తేది బుధవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగునని, కుర్రపాటి రామచంద్ర నగర్ తదితర పరిసర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.